# రేపటి సూర్యోదయం

-పి.ఎస్.నారాయణ

కొన్ని క్షణాల నిశ్శబ్దం.

ఆమె తట్టుకోలేనట్లుగా కలవరపడుతున్న వదనం. నా కళ్లల్లోకే సూటిగా చూస్తూ రెండు చేతులు జోడించి ''నాలో రగులుతున్న మంటల్ని ఆర్పవద్దు. నన్ను మాట్లాడనివ్వండి'' అన్నది నీరసంగా.

ఆమెను చూస్తూ నేను మాట్లాడలేకపోయాను.

నేను ఎంతో ఉత్సాహంగా వచ్చాను. రామం ఏర్పాటుచేసిన ఉద్యోగం గురించి ఆమెకు చెప్పడానికి, కానీ రెండుసార్లు చికాకు కలిగించే పరిస్థితులే. అసహనంగా అటూ ఇటూ కదులుతూ ''రమేష్ కనబడితే ఏమయింది?'' అన్నాను. త్వరగా ఆ విషయానికి తెరదించేయాలి అన్నట్టుగా.

''సరోజ అంటే ఏమిటో చూపిస్తాను'' అన్నది గయ్‌మని లేస్తూ కొత్త ఊపిరి తీసుకుంటున్నట్లుగా.

''ఏం చేస్తావ్ అతడిని? నువ్వేమీ చేయలేవు'' ఈసడింపుగా అన్నాను.

''నరికి పోగులు పెడతాను'' ఆ క్షణాన ఆమె కళ్లు అగ్నిగోళాల్లా వున్నాయి.

నేను హేళగా నవ్వాను ''అంటే ఇంకొక ఆడదాని తాడు తెంచుతావన్నమాట''

ఒక్కసారిగా సరోజ ముఖం తెల్లగా పాలిపోయింది. కాని అది ఒక్క క్షణమే. తిరిగి మొహంలో నెత్తురు విరజిమ్మింది.

''నన్ను సెంటిమెంట్లతో ఓడించవద్దు. పోరాటం నాకూ ఆ రాస్కెల్‌కే నడుమ. మూడోవాళ్లు నాకు కనబడరు''

''నువ్వే చెప్పావ్. అతడు ధనవంతుడు, బలవంతుడు అని. సంఘంలో ఆ ధనమే అతడిని చాలా ఉన్నత స్థానంలో నిలబెడుతుంది. అతడు చేసే ఎలాంటి తప్పుడు పనైనా అందరి దృష్టిలో అది ఘనంగా కనబడేలా చేస్తుంది ఆ డబ్బు''

నాకు నవ్వాగలేదు. ''అతడిముందు నువ్వొక దడ్డిపోచలాంటిదానివి. కనుక మేడమ్... ఊరికినే గాలిలోపడి కొట్టుకుపోయిన నీ అస్థిత్వాన్ని కోల్పోయే దానికంటే మంచి అవకాశం వచ్చింది, వెర్రి ఆలోచనలు మాని నేను చెప్పిన పని చేయి. నువ్వు సమాజంలో గౌరవప్రదంగా బ్రతకడమే కాకుండా నువ్వు కోరుకుంటున్నట్లుగా నీ తమ్ముళ్లనూ, చెల్లెళ్లనూ ఉద్ధరించను కూడా వచ్చు. అలా చేయడంవలన వాళ్లు కూడా నిన్ను చూసి గర్వపడతారేతప్ప నిన్ను ఈసడించుకోవాల్సిన స్థితిలో వుండరు''

ఆమె నా మాటలకు నీరసంతో కృంగిపోతున్నట్లుగా ''అది నావల్ల అవుతుందా? మీరంటున్న ఈ సంఘం నన్ను గౌరవంగా బ్రతకనిస్తుందా? నా అందాన్ని నాకుగా వదిలేసి దూరదూరంగా తిరగగలుగుతుందా?'' అన్నది చిన్నగా.

''ఛత్! అందమైన ఆడవాళ్లందరి గతీ ఇంతేననా మీ ఉద్దేశ్యం?'' ఈసడింపుగా అన్నాను.

ఆమె ముఖాన్ని రెండు చేతులతో కప్పుకున్నది. ఆమె గుండెల్లోంచి ఎగతన్నుకొస్తున్న దుఃఖాన్ని నిగ్రహించుకునేందుకు ప్రయత్నిస్తోంది.

ఆమె విసురుగా లేచి నిలబడి తలుపు లోపల ఘడియవేసి నాకు దగ్గరగా వస్తూ కలవరపడుతున్న నాకు అతి సమీపంగా నిలబడి చటుక్కున చీరను మోకాలుపైవరకూ ఎత్తింది.

**మూడవ వారం**

జరిగిన ఘోరాన్ని ఈ తొడమీద కాలిన మచ్చ మీకు చూపిస్తోంది. ఈ రాక్షసి ఆ ఛండాలుడూ కలసి నేను వాళ్లు అనుకున్నంతగా డబ్బు సంపాదించనందుకు పెట్టిన వాత ఇది.'' చాలా చిన్నగా దుఃఖంతో తడిసిన మాటలను ముద్దముద్దగా నాముందు వెళ్లగక్కింది. నేను కలవరపడుతూ లేచి నిలబడ్డాను.

నేను మొఖం పక్కకు తిప్పుకుంటూ ''ఏమిటది?'' విసరుగా అన్నాను.

''ఇక్కడ సిగ్గు పడాల్సిందేమీలేదు మాస్టారు. జరిగిన ఘోరాన్ని ఈ తొడమీద కాలిన మచ్చ మీకు చూపిస్తోంది. ఈ రాక్షసి ఆ ఛండాలుడూ కలసి నేను వాళ్లు అనుకున్నంతగా డబ్బు సంపాదించనందుకు పెట్టిన వాత ఇది.'' చాలా చిన్నగా దుఃఖంతో తడిసిన మాటలను ముద్దముద్దగా నాముందు వెళ్లగక్కింది.

నేను కలవరపడుతూ లేచి నిలబడ్డాను.

''అవును దీని సాక్షిగా'' చీర క్రిందకు జారుస్తూ అన్నది ''ఈ ముసల్ది ఆయన తరపున నాకు కాపలాగా ఉంచబడిన మనిషి''

''పోలీసులను పిలవనా?'' ముక్కుపుటాలు కోపంతో అదురుతుండగా అన్నాను.

''ఫలితం? నా అందమే నాకు శాపమైనప్పుడు నేను ఈ తోడేళ్లను ఎన్నాళ్లు ఎలా తప్పించుకుని బ్రతకగలను? నాకు చావు ఒక్కటే రక్ష అని నాకు తెలుసు. కానీ చావను. ఎందుకంటే నేను ఇలాంటి నికృష్టపు పశువులనన్నిటినీ ఒక ఆట ఆడిద్దామనే కృతనిశ్చయంతో ఉన్నానుకనుక. ఈ కుళ్లు వ్యవస్థను ప్రక్షాళితం చేయాలనే తపనలో వున్నాను కనుక''

★★★

''మీరు ఇచ్చిన అడ్రస్‌కు వెళ్లాను ఆయన్ను కలుద్దామని. ఆయన ఢిల్లీ వెళ్లారుట అనుకోకుండా ఏదో అర్జంట్ పనిమీద ఉదయం ఫ్లైట్‌కి. వారంరోజుల తరువాతగానీ ఆయన రాకపోవచ్చు''

ఆమె మాటల్లో నిరాశ, నా గుండెల్లో నిరుత్సాహం.

''మీరు నా గురించి నా బాగు గురించి తాపత్రయ పడుతున్నప్పుడు నేనెందుకు సహకరించకూడదని వెళ్లాను. కానీ ఇవి నా జీవితానికి సరిపడేవి కావు. ఇలాంటివి నాకు కలిసొచ్చేవైతే నా జీవితం ఇంత ఛండాలపు మలుపు తిరిగేదే కాదు'' అన్నది పేలవంగా నవ్వుతూ.

ఆ రోజు సాయంత్రం ఆరుగంటలకు నేను ఆఫీసు నుంచి వస్తూనే ఆ విషయం కనుక్కుందామని ఆ మేడ మెట్లెక్కాను.

ఆ సమయంలో ఆమె స్నేహితులెవ్వరూ లేకపోవడం నాకెందుకో శుభసూచకంగా కనిపించింది.

కానీ జరిగింది వేరు.

ఆమె మాటలకు నాకు జాలి వేసింది.

నిజమే. కొందరి జీవితాలు అలాగే ఉంటాయి. కొందరు ఏం పట్టుకున్నా బంగారమవుతుంది. కొందరికి బంగారం పట్టుకున్నా బూడిదయి కూర్చుంటుంది.

లోపలకు వెళ్లి కాఫీ కలుపుకు తీసుకువచ్చి నా చేతికిచ్చి నా ఎదురుగా సోఫాలో కూర్చుంది.

తల వంచుకు కాఫీ తాగుతూ నిశ్శబ్దంగా


కూర్చున్నాను. మాట్లాడేందుకు ఇంకేమున్నాయి మాటలు!

''మీరు మా ఇంటికి ఎంత తక్కువగా వస్తే అంత మంచిది. మీ ఆఫీసు ఫోను నెంబరు ఇవ్వండి. నేనే మాట్లాడతాను అవసరమొస్తే'' లోగొంతుతో చాలా చిన్నగా అన్నది సిగ్గుపడుతున్నట్లుగా తలొంచుకుని.

నేను ఉలిక్కిపడ్డట్టుగా తలెత్తి ఆమె ముఖంలోకి చూశాను.

''నేను చాలా చెడ్డదాన్నని నాకు పేరు వచ్చింది. అలాంటి పేరు మీరు కూడా ఎందుకు తెచ్చుకుంటారు?''

ఆమె భావం అర్థమయినప్పుడు నేను నిర్లక్ష్యంగా లోపలకు వచ్చిన ద్వారంవైపుకే చూస్తూ వుండిపోయాను. అక్కడో మనిషి వున్నట్లుగా క్రీనీడ ఆపైన సన్నగా



కదులుతున్న కర్టెను.

ఆమె మాటలకంటే ఆ పరిసరాలే నాకు కాస్త భయం కలిగించినాయి.

సరోజ మాటలు నాకు సలహా ఇస్తున్నట్లుగా అనిపించలేదు. హెచ్చరికలాగానే ఉన్నది.

దాని ఫలితమేమిటో తరువాత మూడో రోజు ఉదయాన్నే తెలిసి వచ్చింది నాకు.

ఆఫీసుకు వెళదామని తయారవుతున్నాను. స్నానం అయింది.

డ్రెస్సు తీసుకుని బూట్లు వేసుకోవడానికి మేజోళ్ల తొడుక్కుంటున్నాను.

అప్పుడు ఆయన తలుపు తోసుకుంటూ లోపలకు వచ్చి ''నేను రెండు మంచి మాటలు చెప్పి వెళ్దామని వచ్చాను. వినడానికి మీకేం అభ్యంతరం లేదుకదా'' కీచుగొంతుకను ఎగతాళిలో రంగరించి వదిలినట్లుగా వున్నాయి ఆ మాటలు.

అంత దగ్గరనుంచి ఆ మనిషిని ఎప్పుడూ చూడకపోవడంతో కాస్త తడబడ్డాను.

''మీరెవరు?'' అన్నాను కుర్చీలోంచి లేచి నిలుచుంటూ.

''నేను మీ ఎదురింటి మేడమీద సరోజ తండ్రిని. ఏమిటీ... మా అమ్మాయికి నువ్వేదో ఉద్యోగం చూస్తున్నావుట. మీకుకాని విషయాల్లో మీరు కల్పించుకోవడం మీ వంటికి అంత మంచిదికాదని చెప్పడానికే వచ్చాను'' సూటిగా అసలు విషయంలోకి వస్తూ అన్నాడు.

''అంటే?''

అతడి మాటలను లెక్క చేయడం ఇష్టం లేదన్నట్లుగా విసురుగా అన్నాను.

''నేను ఎవ్వరికయినా అర్థమయ్యేలా చెప్పడమంటే చాలా ఘోరాలే జరిగిపోతాయి. వద్దు... చెప్పింది విను. సరోజతో ఇంకెప్పుడూ మాట్లాడడానికి ప్రయత్నించబోకు. సరోజను ఏదో ఉద్ధరిద్దామన్నట్లుగా తాపత్రయపడకు. నేను చాలా మంచివాడిని. నీలాగా మరొకరి విషయాల్లో ఎప్పుడూ కల్పించుకోను. వస్తాను''

అతడు వచ్చినంత వేగంగానే నా ఇంటి గడప దాటాడు నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తూ.

కానీ మరుక్షణంలోనే తిరిగి నా ఎదుట ప్రత్యక్షమయి ''మీరు అనుకుంటున్నట్లుగా అది ఉద్యోగం చేయాలీ అని అనుకోవాలేగానీ ఆ ఏర్పాట్లు చేయడం నాకు చిటిక వేసినంత తేలిక'' అంటూ చిటిక వేసుకుంటూ గేటు తీసుకుని వడివడిగా వెళ్లిపోయాడు.

నాకు తల తిరిగిపోయింది.

ఇదెక్కడి ఘోరం?

నేను చేస్తున్నది చెడ్డ పనా?

ఊబిలో ఇరుక్కుపోతున్న ఓ అభాగ్యురాలిని బయటకి లాగి నిలబెట్టాలనుకోవడం నేరమా?

అందునా ఆ మాట చెబుతున్నది ఆ అమ్మాయి తండ్రా?

చికాకుతో గూడిన మనసుతో రోజంతా చాలా నీరసంగా గడిచిపోయింది.

ఆఫీసులో పనిమీద కూడా ధ్యాసను నిలపలేకపోయాను.

అసలు అతడు వచ్చివెళ్లిన షాక్ నుంచి కోలుకున్న తరువాత నిగ్రహించుకోలేని ఆవేశం వచ్చింది.

వెళ్లి అతగాడి చొక్కా పట్టుకుని లోపలకు ఈడ్చుకువచ్చి తన్నాలన్నంత కోపం వచ్చింది. అయినా సభ్యత అడుగు ముందుకు వేయనీయలేదు. ఇక ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ అమ్మాయి విషయంలో నేను జోక్యం చేసుకోకూడదని అనుకున్నాను. చేసుకుని నలుగురిలో అభాసు అయ్యేదానికంటే మౌనంగా చూస్తూ ఊరుకోవడం మేలనుకున్నాను.

ఎవరి ఖర్మకు ఎవరు బాధ్యులు?

సాయంత్రం ఆఫీసు నుండి ఇంటికి వస్తూ కాఫీ త్రాగుదామని హోటల్‌కి వెళ్లినప్పుడు టేబుల్‌ముందు ఒంటరిగా కూర్చున్న సరోజ కనబడింది.

నన్ను చూస్తూనే ''హాయ్'' అంటూ చేయి ఊపింది.

పొద్దున జరిగిన సంఘటనవలన ఏర్పడిన నా మనస్సులోని బాధనంతా వెళ్లగక్కేందుకు మంచి అవకాశం దొరికినట్లుగా త్వరత్వరగా వెళ్లి ఆమె ముందు కూర్చున్నాను.

''మీరు ఎప్పుడు కనబడతారా అని ఆత్రుతతో ఎదురు చూస్తున్నాను'' అన్నాను.

''ముసలివాడి హేయమైన పనికి నన్ను నిలదీయాలనేదే మీ ప్రయత్నమైతే నేను నిస్సహాయురాలిని'' బాధగా అన్నది.

''నాకు తెలుసండీ. జరిగినదంతా నాకు తెలుసు. మీలో కుతకుతలాడుతున్న ఆవేశం నాకూ తెలుసు'' తలొంచుకుని అన్నది. ''నేను ఎమ్మే సైకాలజీని'' నవ్వినా చాలా పేలవంగా వున్న ఆ నవ్వు. నాలోని ఆవేశాన్నంతా చల్లారుస్తూ నా నెత్తిన బిందెడు చన్నీళ్లు కుమ్మరించింది.

''నేను చేసింది తప్పా?'' నీరసించిపోయాను.

''కాక...మీకెందుకు వచ్చిన బాధండీ నా గురించి. తనకు కాని వాటిల్లో తల దూర్చడం అంటే కొరివితో తల గోక్కోవడంకాదా?''

నేను మాట్లాడలేకపోయాను.

జరిగినదానికి ఎంతగానో బాధపడుతున్నట్లుగా ఆమె మాటలు ముద్దముద్దగా వస్తున్నాయి.

రెండు నిముషాలు మా మధ్య ఏ సంబంధమూ లేనట్లుగా నిశ్శబ్దంగా గడిచిపోయింది.

బేరర్ వచ్చాడు.

''రెండు కాఫీ...స్ట్రాంగ్'' సరోజే చెప్పింది.

తిరిగి మౌనం ,కాఫీ వచ్చేంతవరకూ.

కప్పులు ముందుకు లాక్కుని కాఫీ త్రాగుతూ సరోజే మొదటిసారిగా నోరు విప్పింది.

''ఇప్పుడు రమేష్ వస్తున్నాడు ఇక్కడకు'' అన్నది కళ్లు సగం ఎత్తి నావైపు చూస్తూ. పెదాలు సాగదీస్తూ చిన్నగా నవ్వింది కూడా.

సూటిగా చూసాను ఆమె ముఖంలోకి.

ఆ కళ్లల్లోగానీ, పడవలా పొడుగ్గా వంకర తిరిగివున్న ఆ కనురెప్పలలో కానీ నాకు ఎలాంటి అందమూ కనబడలేదు.

కొద్దిరోజుల క్రితం అందంగా గులాబీ రెక్కల్లా కనిపించిన ఆమె పెదిమలు తెల్లగా పాలిపోయి వున్నట్టనిపించింది ఆ క్షణాన నాకు.

అసలు ఆమె 'రమేష్ వస్తున్నాడు' అని చెబుతున్న తీరు నాకు చాలా అసహ్యంగా అనిపించింది.

డబ్బుకోసం ఎలాంటి హేయమైన పని చేయడానికైనా సిద్ధమే అన్నట్లుగా వున్నది ఆమె కంఠం. లేకపోతే తననీ, తన జీవితాన్ని సర్వనాశనం చేసిన అతడితో ఆమెకేమిటి పని?

''ప్రస్తుతం మామగారి అండన ఓ పెద్ద కంపెనీకి డైరెక్టరయ్యాడు'' అన్నది మరోసారి నవ్వి.

ఆమెను, నవ్వుతున్న ఆమెను చూస్తుంటే నాకు ఒళ్లు గగుర్పొడిచింది. ఆ డిమ్‌లైట్ కాంతిలో ఓ విషనాగులా వుంది.

ఆమె మాట్లాడుతున్నప్పుడు సన్నని నాలిక పాము నాలికలా ముందుకు వెనక్కు కదులుతున్నది.

''నేను మరో టేబుల్ దగ్గరకు వెళతాను'' చిరాగ్గా లేవబోతుండగా ఆమె వారిస్తూ ''అదేమిటి? అతడొస్తే మీకేమిటి? వుండండి. పరిచయం చేస్తాను'' అన్నది.

''నాకు అవసరంలేదు అతడి పరిచయం''

''డబ్బున్న మనిషి ఎలా మాట్లాడుతాడో తెలుసుకోవాలి అంటే అతడితో ఓ పావుగంట గడపాలి. అదో థ్రిల్లు'' నవ్వింది కళ్లుపెద్దవి చేసి చూస్తూ.

''ఆ మనిషి డబ్బులు కొల్లగొట్టే ప్రయత్నమా ఇది?'' ఎగతాళిగా అన్నాను.

క్షణంలో ఆమె బిగుసుకుపోయింది.

సూటిగా నా మొహంలోకే చూస్తూ చలనరహితంగా వుండిపోయింది కొద్దిసేపు.

''కాదు''

''మరి?''

కొత్త ఊపిరి పోసుకుంటున్నట్లుగా టేబుల్‌మీద వున్న మంచినీళ్ల గ్లాసును తీసుకుని గడగడా త్రాగింది.

''రమేష్‌కు మరణదండన విధించబోతున్నాను''

నేను ఆమె మాటల్ని చాలా తేలిగ్గా తీసుకుంటూ నవ్వాను.

''డబ్బు గుంజా?''

''బోడి డబ్బు. డబ్బే కావాలనుకుంటే కనుసైగ చేస్తే చాలు కట్టలు వచ్చి వాల్తాయి నాముందు. దానికోసం నన్ను నాశనం చేసిన అతడి చుట్టూ భజన చేస్తూ తిరగాలా?'' విసురుగా అన్నది.

''అయితే ఏం చేద్దామని?''

''చూస్తారుకదా? నా తీర్పుకు తిరుగుండదు'' చాలా చురుకుగా ఉన్నది ఆమె కంఠం.

నాకు కొద్దిగా భయమేసింది ఆమెలోని తీక్షణకు.

-మిగతా వచ్చేవారం

★



## భయపెడుతున్న 'రమ్య'

ప్రస్తుతం హిందీ సినిమా ఛాన్స్‌లు ఎక్కువగానే వున్న రమ్యకృష్ణ, బాలీవుడ్‌లో రేపటి 'నంబర్‌వన్ హీరోయిన్' తనేనంటూ ఇన్‌డైరెక్ట్‌గా చెప్పింది. ఓ ఆంగ్ల పత్రిక విలేఖరి మరేదో ప్రశ్నిస్తే తను అనవసర ప్రసంగం చేస్తూ ''...ఈరోజు అనే కాదండీ, ఉత్తరాదిలో ఎప్పుడూ దక్షిణాది హీరోయిన్సే నెంబర్‌వన్ పొజిషన్‌లో వున్నారు. హేమమాలిని, రేఖ, శ్రీదేవి...'' అంటూ లిస్ట్ చెప్పుకొచ్చింది. ''అయితే రేపటి నెంబర్‌వన్ హీరోయిన్ మీరే కావచ్చేమో?'' అని ఆ విలేఖరి తెలివిగా అనగానే, ''అబ్బే! నేను ఆ దృష్టితో అనలేదు'' అంటూ లౌక్యంగా తప్పించుకుంది... ఇదిలా వుంటే, ఎప్పుడూ భర్తవెంట ఏ షూటింగ్‌కీ హాజరుకాని, డేవిడ్ ధావన్ భార్య ఇప్పుడు భర్తను క్షణమైనా వదిలి వుండట్లేదట. చివరికి హైదరాబాద్‌కి కూడా ఆమె తన భర్తవెంట వచ్చింది. ఆమె ఈ సరికొత్త పద్ధతికి కారణం ఏమిటా అని విచారిస్తే- 'రమ్యకృష్ణ'నే అని తెలిసింది. మొత్తంమీద రమ్య చాలామంది ప్రముఖుల భార్యలను భయపెడుతోంది.

-జె.వి.బాబు